సులభ

తటవర్తి సూర్యనారాయణమూర్తిగారు

సులభ నైష్ఠికబ్రహ్మచారిణియై జనకమహారాజు కాలమందు జీవించియుండెను. జనకుఁడు రాజ్యకార్యమగ్నుఁడైనను బూర్ణవిరాగియై, గొప్పవిద్వాంసుఁడై, తత్త్వజిజ్ఞాసుఁడైయుండెను వారి రాజసభయందు దూరదూరదేశములనుండి పండితులు విద్వాంసులు చనుదెంచి శాస్త్రచర్చ నొనర్చుచుండిరి సులభయు పరమ విదుషీరత్నమై శాస్త్రచర్చయం దాసక్తిగలిగియుండెను యోగక్రియలందు సాధనములందు నామెపారంగతురాలై యుపయుక్తభర్త లభించకపోవుటచే ఆజీవితము బ్రహ్మచారిణియై వెలుంగుచుండెను. ఎందుకన నాసమయమునందు పరిణయమగుటకుముందే సన్యాసాశ్రమస్వీకారమొనర్ప నధికారముగలదు ఇందుచే నీమె సన్యాసినిగూడనయ్యెను ఈమెకు జనకుఁడు మోక్షధర్మమందు ప్రవీణుఁడైయుండెనని తెలియుటతోడనే యాతని పరీక్షింప మిథిలకుబోయెను

ఆమెయోగవిద్యచే తన సన్యాసినీవేషముద్యజించి సుందరీరూపముదాల్చి కొలఁదిదినములలో విదేహ నగరముఁజేరెను అచ్చట బిచ్చమెత్తుకొనుకైతవముచే జనకునిజేరి నామె సౌకుమార్యముగాంచి రాజాశ్చర్య నిమగ్నుఁడయ్యెను

అతఁడుమనంబున నీమెయెవతెయో యెచ్చటనుండి చనుదెంచినదోయని తలపోసి యామె కనేకాదర సత్కారములాచరించి కూర్చుండబీఠమర్పించి పాదములగడిగి అనేకపూజలుచేసి యుత్తమోత్తమభోజన మొనరింపజేసి చాలగతృప్తిపఱచెను భోజనానంతరము సులభ మోక్షధర్మవిషయమై రాజు ననేకప్రశ్నల వైచెను కాని యామె సంశయము దీఱకపోవుటచే నీతఁడు ముక్తుండా? కాఁడా? యని యనుమానించి నిజ యోగబలముచే రాజమస్తిష్కముఁజేరెను అప్పుడు రాజిట్లుపలికెను.

"ఓపూజ్యదేవీ! నీవేమి యాటనాడుచుంటివి? నీవెవరికుమార్తె వెవరిభార్యవు? అడుగకుండ నితరుల జాతి, మత, విద్య, ఆయువులు గ్రహించుట సులభేతరము ఎచ్చటనుండి వచ్చుచుంటివి? ఎచ్చటికేగుచుంటివి? నాపరిచయముగూడ నెఱింగించుచుంటిని వినుము నేను రాజ్యమదముక్తుఁడను నీతో నేను వైరాగ్య చర్చనొనర్పదలచుచుంటిని ఈవిషయమై నిన్నుబ్రశ్నింప నెవ్వరును సమర్థులులేరు పరమబుద్ధిమంతుఁడగు పంచశిఖునిశిష్యుఁడను ఆతఁడు నాశంకలనన్నింటినిబోగొట్టెను. నేను యోగసాంఖ్యశాస్త్రములందు పారంగతుఁడను మోక్షకర్మ, ఉపాసన, జ్ఞానములు మూడుసాధనముల నే నెఱుంగుదును పంచశిఖమహాత్ముఁడు చాతుర్మాస్య మిచ్చట నేజఱిపిరి వారు నాకు యోగవిద్యనలవడఁజేసిరి కాని రాజ్యమువిసర్జింపుమని నా కాజ్ఞాపించియుండలేదు వారు మోక్షమునకై నిష్కామకర్మల నొనర్పుమనియె చెప్పియుండిరి యోగముచే జ్ఞానమలవడును జ్ఞానముచే నఖిలసుఖదుఃఖవిముక్తియు జరుగును నాకీజ్ఞానమే దొఱకినది ఈసంసారజీవితము వలన నాకు కొంచెమిచ్చి పుచ్చుకొనుటజరుగదు తడుపబడిన భూమిపై బీజము లెట్లునాటుకొనునో యట్లే మనుజులకర్మోత్పత్తి జరుగుచున్నది గురూపదేశముగా వాసనారూపమైన బీజమును నశింపజేసినది అందుచే దానికి మొలకయైన బయలుదేఱదు. సుఖదుఃఖములు నామనస్సునకు సమానములు. ఒకడు నాయొక్కహస్తముపై జందనము, రెండవకరముపై నగ్నిబూసిన నీరెండుకర్మలును నాకు సమానములే నాకు మృత్తిక, శిల, సువర్ణము సమానములు. సంబంధములన్నిఁటినివిడచి నేను రాజ్యమొనర్చుచున్నాను కనుక నేను త్రిదండసన్యాసులలో శ్రేష్ఠుఁడను. శాస్త్రమందు జ్ఞానము, ఉపాసన, కర్మ యివిమూడును స్థితిని తెలియబరచుచున్నవి మహాత్ముఁడయిన పంచశిఖుఁడు నాకు కర్మలవలన మంచిజరుగుచో దానికై చింతింపరాదనియు, కర్మలప్రయోజన మున్నను లేకున్నను వాటినిత్యజింపగాదనియు శిక్షనొసంగియుండెను. ఇటువంటివృత్తి గ్రహించువాడు యత్నము, నియమము, కామము, ద్వేషము, పరిగ్రహము, మానము, దంభము, స్నేహము మొదలైన విషయముల

నన్నిఁటిని సమానబుద్ధిలో జూడవలెను కషాయవస్త్రములు ధరించుట, వపనమొనరించుకొనుట, దండకమండలులుదాల్చుట మొదలైన కార్యములనన్నిటిని నేను బాహ్యచిహ్నములని తలంచుచున్నాను నాయాలోచన ప్రకారమివియేమియు మోక్షహేతువులుకావు ముక్తికై వస్తుత్యాగము, వస్తుగ్రహణము ముఖ్యమని నేను తలంపను నేను జ్ఞానమునే యావశ్యకమని తలంతును ఇందుచేత నే ధర్మము, అర్థము, కామము, రాజ్యవైభవము మొదలైన బంధనములచే గూర్పబడినను నేను ముక్తుఁడను నాకేబంధనములేదు . స్నేహరూపబంధనముచే గట్టబడిన రాజప్రభుత్వపాశమును నేను జాతిపైనూరి పదునుగూర్చిన నిజత్యాగఖడ్గముచె భేదించితిని అయినను నేనీవిధముగ జీవన్ముక్తుడను. మరియు యోగప్రభావయుతవగు నిన్నుగాంచ నాకమందాదరభావముత్పన్నమగుచున్నది ఓభిక్షుకా! నీసుందరత్వము, అవస్థయునిప్పుడు యోగగ్రహణానర్హములైనను నీయందు సన్యాసులకుదగిన యమ, నియమాత్మసంయమములు స్పష్టముగ గానుపించుచున్నవి ఇది నాకాశ్చర్య కారణమగుచున్నది. నీవు కపటముగ మెలగుచుంటివని నాకనుమానముగ నున్నది నీవెందుకిట్లుంటివి? నేనిదెరుగ జాలకుంటిని. నీవిప్పుడీసన్యస్తధర్మము విడనాడకుండుమని నే సలహాచెప్పుచున్నాను గుప్తవేషముదాల్చి నీవు జనకుడు ముక్తుడోకాడో గ్రహింప నిశ్చయించినట్లు తోచుచున్నది నీయాంతరంగికమైన యుద్దేశ్యమేమి? నీయాగమనకారణము, నీజాతియు, నీయధ్యయనాది సంగతులు యావత్తునెఱింగింపుము."

ఈరాజాక్షేపణలు సులభకినుమంతయు కష్టమనిపించలేదు జనకుఁడడిగిన సంగతులన్నిటికి విస్తారపూర్వకమగు జవాబొసంగెను.

మొదట రాజునకు వాణి యెన్నివిధములుగనుండవలయునో,,వాణిలోపల రెండవగుణములేవేవి సమావిష్టములైయున్నవో యెరింగించి మఱియు నిట్లుపలికెను

"వాణిని దూషించెడుదోషములు తొమ్మిదియుండును బుద్ధిని దూషించెడుదోషములును తొమ్మిదేయుండును ఈపదునెనిమిదిదోషములు లేనిదై దీనికి విపరీతమైన యష్టాదశప్రకారగుణయుతమగువాణిని "వాక్య" మందురు సరిగా తెలియనివాక్యము "నుపేతార్థవాక్య" మందురు. విశేషార్థ విరహితవాక్యముల "నభిన్నార్థవాక్యము" లందురు ప్రశంసనొనర్పు విశేషణములుగల వాక్యములను "న్యాయవృత్తవాక్యము" లందురు సంక్షేపముగలిగించు వాక్యములను "సంక్షిప్తవాక్యము" లందురు శ్లేషము, సామ్యము, కాంతి, ఓజస్సు, (ఆర్జవము,) స్పష్టవాదిత్వము, ఉదారత్వము, రీతి, గతి, ఈయెనిమిదిగుణముల గలిగిన వాక్యముల "గోమలవాక్యము" లందురు. వీటినే శ్లక్ష్ణవాక్యములనికూడ నందురు దీనికి విపరీతముగ నష్టగుణవిరహిత వాక్యముల "నశ్లక్ష్ణవాక్యము" లనియు "నకోమలవాక్యము" లనియు చెప్పుదురు సందేహముత్పత్తి కాని వాక్యముల "నసంధిగ్ధవాక్యము" లందురు బుద్ధిదోషములందు కామము, క్రోధము, భయము, లోభము, నమ్రత, గర్వము, లజ్జ, దయ, మానము, మొదలయినవాటిని లెక్కించి మరియు నిట్లనియె.

"ఈతొమ్మిది బుద్ధిదోషములతో నే నెప్పుడునుమాట్లాడను రాజా! ఆత్మపదార్థములందు బేధముపడకుండ నెవడు మాట్లాడుచుండునో వానినే నిజమయినవక్తగా నెరుంగవలయును రజ, జలబిందువుల స్వభావముచే పరస్పరము కలిసికొనునట్లు ప్రాణులశరీరములు కలునుకొనును ఇందుచే శరీరముకంటె భిన్నముగ నాత్మలో శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను పంచేంద్రియములు కలిసికొనును

నీవు నన్నెవరని యడిగితివి. కాని యీప్రశ్న వ్యర్థము ఎందుకనగా లక్క, కాష్ఠముసంయోగమువలె నేనును జడచేతనసంయోగముచే దయారయితిని. ఇందులో నీవు జడప్రశ్నవైచుచో నీయందున్న జడయే(అచేతనము) నాయందునున్నది సముదాయప్రశ్నమడిగినచో నీయందున్న సముదాయమే నాయందునునున్నది. అందుచే నీప్రశ్నవ్యర్థము ఇంద్రియములగురించి యెవ్వడు నడుగడు నీవెవరవు? నేత్రములు తన్నుగాంచజాలవు. శ్రవణములు తన్నువినజాలవు ఈవిధముగ నింద్రియములుగూడ నొకటి రెండవదానిని నెరుగజాలవు

ఇతరవస్తువులగాంచ నెట్లు సూర్యకాంతికావలెనో యట్లే యింద్రియములుకూడ నన్యపదార్థప్రకాశము జేయుటకై వెలుపలి ఇతరగుణ మావశ్యకమగుచున్నది. జ్ఞానేంద్రియములైదును గర్మేంద్రియములైదును, గాక పదునొకండవది "మనస్సు" ఉన్నది దానివలన మనుజుఁడు మంచిచెడ్డలాలోచింపజాలుచున్నాడు పండ్రెండవది "బుద్ధి". దానివలన తెలియదగిన విషయములు తెలియుచు శంకానివారణమగుచున్నది పదమూడవగుణము "సత్వము" దానివలన మనుష్యుడెంతవరకు సత్వగుణముకలవాడో తెలియుచున్నది పదునాల్గవగుణ "మలంకారము" దానివలన ప్రాణి నేనుకర్తనని యొప్పుకొనుచున్నాడు. ఇది నాదికాదను భావముజేయించునది పదునైదవగుణము. పదునాఱవగుణ "మవిద్య" పదునేడవగుణము "ప్రకృతి" పదునెనిమిదవగుణము "వ్యక్తి". సుఖదుఃఖముల, వృద్ధత్వ మరణత్వముల, లాభహానుల, ప్రియాప్రియముల మిళితయోగము, పందొమ్మిదవగుణము తరువాత "కాల" మను పేరుగలది ఇరువదవగుణము దానివలన ప్రాణిమాత్రుని యుత్పత్తిసంహారములగుచున్నవి. ఈవిధముగ నిరువదేడుగుణములు చెప్పబడుచున్నవి వాటియందు విధి, వీర్య బలములను గుణములను మూటిని గలుపుచో ముప్పదిగుణములగుచున్నవి ఎక్కడ నీముప్పదిగుణములు కలుగునో అదే "శరీర" నామమును బొందుచున్నది ఓరాజేంద్రా! ఏఅవ్యక్తప్రకృతి యీకళలనుంచి వ్యక్తమైయున్నదో అదే నేను. నీవు నితరశరీరధారులుగూడ నదియే కనుక నీవెవరని ప్రశ్నచేయు నావశ్యకతలేదు స్త్రీగర్భమందు బిందుస్థాపితమై, దానితో ప్రారంభమై, వీర్యరుధిరములనుండి యుత్పన్నములైన యుపస్థలను పిండములని చెప్పుదురు ఈపిండములనుండి బుద్బుదములుత్పన్నములగును తద్బుద్బుదమునుండి గ్రుడ్డును, గ్రుడ్డునుండి భిన్నభిన్నాంగములు, నఖములు, రోమము లుత్పత్తియగును నవమాసానంతరము శిశువుత్పన్నమగును అప్పుడు తన నామమువలె రూపమునేర్పడును వాని యొఱ్ఱనివ్రేళ్ళను గాంచి "కుమారు" డందురు సమయము ననుసరించి బాల్యావస్థజనుచున్నది కానిఅది తిరుగరాజాలదు. దానితరువాత యువావస్థయు, ననంతరమున వృద్ధావస్థయు ప్రాప్తించుచున్నవి. క్రమక్రమముగ మొదటియవస్థ నాశనమగుచున్నది కాని తిరుగరాదు అనంతరమున శరీరమునకుగల పదునాఱుకళలు పరివర్తనమగుచున్నవి కాని యత్యంతసూక్ష్మమైన దగుటచే నీభేదమెవ్వరికి తెలియబడదు నూతనాశ్వమెటుల స్వారిజేయునప్పుడు ప్రతినిముషమందు దనస్థానమును మాఱిపోవుచున్నదో యటులే యీశరీరము ప్రతినిముషము మాఱిపోవుచున్నది అందరకు నెల్లప్పుడీగతియే జరుగుచున్నది నీవు నన్ను ఎవరవు? ఎచ్చటనుండి వచ్చితివి? అని అడిగితివి అది వ్యర్థమగుచున్నది. నీవేప్రకారముగ నీవిషయమై నీయాత్మనుగాంచజాలుచుంటివో అటులే ఇతరులవిషయమై ఇతరులయాత్మ నెందుకు గాంచజాలవు? మైథిలా? "ఇదినాది" "ఇదినాదికాదు" అను జగడమునుండి యెవ్వడు ముక్తుడగునో వానికి "నీవెవరవు? ఎవరిదానవు" అను మాటలడుగుటచే ప్రయోజనమేమి?"

ఈవిధముగ సులభ తత్వజ్ఞానములనేకములు చెప్పి జనకుని భ్రమ, విచారములనన్నిటిని దొలంగజేసెను. మఱియునిట్లుచెప్పెను

"మోక్షమార్గము చాలకష్టము గృహస్థాశ్రమమందు ముక్తిగాంచుట దుర్లభము ఇందునకై సన్యాసమే సర్వశ్రేష్ఠము. జాతికి నేను బ్రాహ్మణ, వైశ్యకులములలో బుట్టియుండలేదు. శూద్రకులములో జన్మించియుండలేదు. నీసజాతీయమైన క్షత్రియవంశజను నేను భ్రష్టురాలనుకాను గాన నాయుత్పత్తి శుద్ధమైనది "ప్రధానుఁ"డను ప్రసిద్ధరాజర్షిని తమరెఱింగియేయుందురు. ఆకులమందే నాజన్మమయ్యెను. నాపూర్వజులు చాలయజ్ఞములొనర్చియుండిరి. నాకనురూపవరుడు లభింపకపోవుటచే నేను బ్రహ్మచారిణినైతిని. ఇందుచే మోక్షధర్మమునందు ప్రవృత్తనై, సాధువ్రతముదాల్చి యొంటరిగ నీ పృథ్వియంతయు దిరుగుచుంటిని. నాయం దేవిధమైన కపటములేదు. నే నితరుల ధనమాశింపను నేను నాధర్మముమీద నే దృఢురాలనై యుం

దును ఓరాజా! నేను నాప్రతిజ్ఞపై స్థిరురాలను నేనాలోచింపకుండ, తెలిసికొనకుండ నేమియు ప్రసంగింపను నీప్రశంస నేను చాలవింటిని. నీమోక్షసంబంధమైన విచారములన్నియు భ్రమపూర్ణమగు పొఱపాటుతో నుండెనని యిప్పుడు తెలిసికొంటిని అందుచే నీవిచారములన్నిటిని గ్రహించి నావిచారములను నీపైప్రకటించి నిన్ను యోగ్యమార్గముపైకొనిరానే నిటకుజనుదెంచితిని నాపక్షమును సమర్థించి ఇతరులపక్షమును ఖండించి పక్షపాతమగు కార్యమొనరింపరాలేదు నీమేలుకొఱకే వచ్చితిని అందుచే జీవన్ముక్తురాలను ఇందుచే నాకు నీయుపదేశావశ్యకతయేమి? ఏపురుషుడు తనలాభమునకై నాదవినాదరూపమైన పరిశ్రమమొనర్పడో వాడే ముక్తుడు కాని నీవు నీపక్షమును నిజమొనర్చుకొనుటకు వాదవివాదముల జేయుచున్నావు ఇందుచే నీవు ముక్తుడవుకావు ఇందుచేత నీవు నావాక్యముల నాదరము చేయుము ”

సులభ ఈప్రకారము జనకునికి దత్త్వోపదేశమొనర్చుచు నొకరాత్రి యటవసించి మఱునాడు జనకుని సెలవుగైకొని బయలుదేఱిపోయెను

జనకమహారాజువంటి పరమజ్ఞానితో శాస్త్రములలో గూఢతత్త్వచర్చయందు బోట్లాడుట సామాన్య విషయముకాదు మహాభారతములోని శాంతిపర్వమందుగల జనకసులభాసంవాదమంతయు పారయోగ్యమైనది ఇందుచే నీప్రాచీనార్యలలనల గంభీరవిద్వత్తత సోదరీమణులకు సులభముగ జేకూఱును

భారతదేశార్యవిదుషీమణులలో సులభవంటి వేదాంతజ్ఞచరిత్రము ప్రశంసార్హము.

ఆత్మబలము

గుంటూరి వేంకటశాస్త్రిగారు

ఈసమస్తాసనీతల మిపుడె ఘోర
నిబిడహత్యలనిండిన నిండుగాక.
నాకు నలుసంత పిఱికితనంబులేదు
నామనోగతపథముగ నడతునేను.
ఏమహాశక్తియిపుడు నాహృదయభావ
ములకుకారణము, అద్దియే పూర్ణసిద్ధి
కలుగజేయునునాకు నిక్కముప్రపూత
భావములు కార్యరూపము బడయుటెంత?

ఈమహాకార్యమున ప్రాణమిపుడెవీడ
నేనుసంసిద్ధుడను నాకు దానగల్గు
ఫలితమేమెంచు ఈభూతపంచకమున
నిత్యతనుదాల్చి పనిచేసి నెగడుటొకటి.
ఏను కీర్త్యపకీర్తుల కేకరీతి
స్వాగతమొనర్తు నీలోకసంతతియెడ,
నీయొనర్చుప్రయత్న మనింద్యమనుచు
స్వాగతమొసంగు నాకదే స్వర్గమూర్తి!

తగదువగఁజెంద నీపాదదాసికొరకు

దివాకర్ల వేంకటావధానిగారు

నవ్వెద నొకమారు నాలోనదలవంచి
నీచిత్రచర్యలన్నియుఁదలంచి
కనులఁగాల్వలుగట్ట మనవియోగమ్మున
కోపకయేడ్చెద నొక్కసారి
ఒకయప్పు డెదుట నీవున్నట్లుభావించి
కసిదీరఁగా బయల్ కౌగిలింతు

నింతకరినుఁడవైతి వేలకోయని చిత్త
ముడికింపఁదిట్టెద నొక్కమారు.
మరలివచ్చుట కింకను మాయదైవ
మననుకూలుఁడె కాఁబోలు నాత్మనాథ!
అడిగితివిగానఁ దెల్పితి నంతెకాని
తగదువగఁజెంద నీపాదదాసికొరకు.